నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, గురువారం 22 మే 2025 | MAHABUBNAGAR NARAYANPET

- పాలమూరును ముంచెత్తిన వర్షం
- 3 గంటలపాటు ఏకధాటిగా..
- నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు
- జలమయమైన కాలనీలు, రోడ్లు
- ఇండ్లు, దుకాణాల్లోకి చేరిన నీళ్లు
- ఆదర్శ నగర్‌లో కూలిన శిథిలాల మధ్య దివ్యాంగుల వెతలు
- పలు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

మహబూబ్‌నగర్‌లో పారుతున్న వర్షపు నీళ్లు

మర్లు సమీపంలో పారుతున్న నీళ్లు

జోరు వాన

మహబూబ్‌నగర్, మే 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పాలమూరును వర్షం ముంచెత్తింది. జిల్లా కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున 6 నుంచి ఉదయం 9 గంటల వరకు ఏకధాటిగా పడింది. దీంతో పట్టణంలోని కాలనీలు, రోడ్లు జలమయమయ్యాయి. ఉపరితల ద్రోణి ప్రభావంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందే హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కురిసిన వర్షంతో జిల్లా కేంద్రం అతలాకుతలమైంది. పాలమూరు యూనివర్సిటీ నుంచి అప్పనపల్లి బ్రిడ్జి వరకు ప్రధాన రహదారిపై నీళ్లు చేరడంతో కాల్వను తలపించింది. ప్రధాన రహదారి చుట్టుపక్కల షాపింగ్ కాంప్లెక్స్‌లలో నీరు చేరింది. దీంతో వ్యాపారస్తులకు తీవ్ర నష్టం కలిగింది. బీకే రెడ్డి, శ్రీరామ్‌నగర్ కాలనీతోపాటు రామయ్యబౌలి తదితర ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయ మయ్యాయి. నగరపాలక సంస్థ కార్యాలయం జల దిగ్బంధంలో చిక్కుకున్నది. క్రిస్టియన్‌పల్లి సమీపంలోని దివ్యాంగుల కాలనీలో అధికారులు ఇండ్లను కూల్చడంతో శిథిలాల కిందే వాళ్లంతా బతుకు జీవుడా అని జీవిస్తున్నారు. భారీ వర్షానికి వారంతా శిథిలాల మధ్యనే గడపడంతో వారి వేదన వర్ణణాతీతం. అనేక కాలనీలో డ్రైనేజీలు పొంగిపొర్లడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

నగర పాలక సంస్థ కార్యాలయానికి ఫోన్లు చేస్తే స్పందించలేదు. దీంతో మాజీ ప్రజాప్రతినిధులకు మా కాలనీలోకి నీళ్లు వచ్చాయని ఫిర్యాదులు చేశారు. బస్టాండ్, న్యూటౌన్, అశోక్ టాకీస్ చౌరస్తా, పద్మావతి కాలనీ వద్ద రహదారులపై వరద ప్రవహించింది. మూడ్రోజుల పాటు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయేందిరబోయి సూచించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఆమె పర్యటించి అధికారులకు సహాయక చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షంతో జిల్లా కేంద్రం అతలా కుతులమవుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం లేదన్న విమర్శలకు వినిపించాయి.

3 గంటల పాటు ఏకధాటిగా..

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఉదయం 6 గంటలకు ప్రారంభమైన వర్షం క్రమక్రమంగా భారీగా మారి 9 గంటల వరకు కురిసింది. డ్రైనేజీలు, రోడ్లపై వరద ఉప్పొంగడంతో ఇండ్ల నుంచి ప్రజలు బయటికి రాలేకపోయారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు ప్రవేశించడంతో జనం బయటకు తోడడానికి తంటాలు పడ్డారు. బైపాస్ రహదారి కూడా జలమయం కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రభుత్వ దవాఖాన ఎదుట.. పాత కలెక్టరేట్ వద్ద న్యూటౌన్, మెట్టుగడ్డ ప్రాంతాల్లో రహదారిపై నీళ్లు కాల్వలను తలపించాయి. వర్షపు నీరు చేరడంతో వాహనాలు రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది.

శిథిలాల కిందే తడుస్తూ.. దివ్యాంగులు

గతేడాది రెవెన్యూ అధికారులు పాలమూరులోని 523 సర్వేనెంబర్‌లో దివ్యాంగుల కాలనీలో దివ్యాంగుల ఇండ్లను కూల్చారు. వారంతా ఆ శిథిలాల కిందే నేడు జీవనం సాగిస్తున్నారు. అయితే భారీ వర్షంతో ఇండ్ల శిథిలాల మధ్య అవస్థలు పడటం పలువురిని కలిచివేసింది. నిలువ నీడ లేకుండా చేశారని అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. కనీసం తలదాచుకోవడానికైనా అధికారులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నగర పాలక సంస్థ కార్యాలయం జలదిగ్బంధం

పాలమూరులోని నగర పాలక సంస్థ కార్యాలయం కురిసిన వర్షంతో జలదిగ్బంధానికి గురైంది. ప్రజల రక్షణ మా బాధ్యత అంటున్న అధికారక కార్యాలయంలోనే మురుగు ముందుకు పారే దారి లేకపోవడం విడ్డూరం. ఇటీవల నగర పాలక సంస్థ కార్యాలయం ముందు భారీగా వెలిసిన షాపింగ్ కాంప్లెక్స్‌ల కోసం హడావిడిగా సీసీ రోడ్ల వేశారు. వీధి వ్యాపారాలను తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ యజమానుల కోసం రహదారి వెడల్పు చేశారు. నగరపాలక సంస్థకు చెందిన ప్రహరీని సైతం కూలగొట్టి లోపలి వరకు మళ్లా నిర్మించారు. ఇంత చేసినా వర్షానికి నగరపాలక సంస్థ కార్యాలయం మొత్తం జలమయమైంది. వర్షపు నీరు వెళ్లడానికి తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో నీరంతా కార్యాలయాన్ని చుట్టిముట్టింది. దీంతో లోపలికి అడుగుపెట్టలేని పరిస్థితి. ఇంత జరిగినా నగర పాలక సంస్థ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారన్న ఆరోపణలు వినిపించాయి. ఉదయం 11 గంటలకు కార్యాలయానికి తాపీగా చేరుకున్నారు. కాగా గడియారం చౌరస్తా కూడా వర్షానికి జలమయంగా మారింది.

వరద నీళ్లు నిల్వకుండా చర్యలు తీసుకోండి : కలెక్టర్

మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ పరిధిలో వర్షపు నీరు నిలిచి లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ విజయేందిరబోయి ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని వర్షపు నీటి కాల్వను నగర పాలక సంస్థ, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి పరిశీలించారు. రాబోవు వర్షాకాలంలో వర్షాలతో ముంపు ప్రాంతాలు జలమయం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాల్వ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వానలతో ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, నగర పాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ విజయ్ భాస్కర్ రెడ్డి ఉన్నారు.

చెరువుగా మారిన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో

ఆన్‌లైన్ పరీక్షకు కరెంట్ కోత

- సర్వర్‌లో సమస్యలు తలెత్తడంతో
- సీయూఈటీ యూజీ-2025కి బ్రేక్
- పరీక్ష వాయిదా వేసిన అధికారులు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 21 : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఫాతిమా విద్యాలయంలో సీయూఈటీ యూజీ-2025 పరీక్షల నిర్వహణలో భాగంగా బుధవారం ఉదయం సెషన్‌లో నిర్వహించాల్సి పరీక్ష వాయిదా పడింది. ఉదయం 7 నుంచి 8:30 గంటల వరకు విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించిన అధికారులు అనంతరం గేట్లు మూసివేశారు. ఈ నేపథ్యంలో ఉదయం 9గంటల ప్రాంతంలో పరీక్ష ఆన్‌లైన్‌లో ప్రారంభం కాగా.. కొద్దిసేపటికే విద్యుత్ అంతరాయం ఏర్పడటం, సర్వర్ సమస్య తలెత్తడంతో విద్యార్థులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. పరీక్ష నిర్వహిస్తారా..? లేక వాయిదా వేస్తారా..? అనే గందరగోళం ఎదురైంది. దీంతో విద్యార్థులు పరీక్షా కేంద్రం ప్రధాన గేటు వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు. ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలకు గాను తాము అకాల వర్షాలు కురుస్తున్నా.. సుదూర ప్రాంతాల నుంచి అనేక రకాలైన ఆటుపోట్లు ఎదుర్కొంటూ, అవాంతరాలను అధిగమిస్తూ పరీక్షా కేంద్రానికి చేరుకుంటే నిర్వాహకులు ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ పరీక్ష అని తెలిసి కూడా విద్యుత్ అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఇలా మరోసారి జరగకుండా ఉన్నతస్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయంపై సంబంధిత నిర్వాహకులను సంప్రదించేందుకు ప్రయత్నించగా.. వారు అందుబాటులోకి రాలేదు. పరీక్ష నిర్వహణకు ఎదురైన ఇబ్బందులను ఉన్నతస్థాయికి సమాచారం చేరవేశామని, మరోదఫా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించినట్లు చెప్పుకొచ్చారు.

ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కారు బోల్తా : వైద్య విద్యార్థులకు గాయాలు

తిమ్మాజిపేట, మే 21 : కారు బోల్తాపడి ముగ్గురు వైద్య విద్యార్థులు గాయపడిన ఘటన మండలంలోని చేగుంట వద్ద బుధవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ ఏరియా దవాఖానలో పనిచేస్తున్న వైద్య విద్యార్థులు కారులో మహబూబ్‌నగర్ నుంచి నాగర్‌కర్నూల్‌కు వస్తుండగా చేగుంట గేటు సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న గుంతలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న విఠల్, స్రవంతి, విష్ణులకు గాయాలు కాగా మరో విద్యార్థి ఎలాంటి గాయాలు లేకుండా బయటపడింది. వీరిని స్థానికులు కారులోంచి బయటకు తీసి అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. గాయపడిన వారిలో విఠల్ అనే వైద్య విద్యార్థి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అయితే ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మున్సిపల్ ఏఈ సస్పెన్షన్

అయిజ,మే 21 : విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన అయిజ మున్సిపల్ ఏఈ రాజశేఖర్‌ను జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్ సస్పెండ్ చేశారు. మున్సిపాలిటీలో మిషన్ భగీరథ నీటి సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహించి కలుషిత తాగు నీటికి కారణం కావడంతో మిషన్ భగీరథ అధికారుల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తాగునీటిని పరీక్షల నిమిత్తం పంపగా మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమేనని స్పష్టం కావడంతో బుధవారం మున్సిపల్ ఏఈని సస్పెండ్ చేస్తు ఉత్తర్వ్యులు జారీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే వేటు తప్పదని కలెక్టర్ హెచ్చరించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట
- కాంట్రాక్టు శానిటేషన్ కార్మికుల ధర్నా

నాగర్‌కర్నూల్, మే 21 : ఏడు నెలలుగా వేతనాలు అందగా పస్తులు ఉంటున్నామని, తమ గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని కలెక్టరేట్‌లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వీరికి మద్దతు తెలిపిన సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఏడు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నారని, అధికారులకు విన్నవిస్తున్నా ఏమాత్రం పట్టించుకోవడ లేదని వారు ఆరోపించారు. వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల వారి కుటుంబాల పోషణ ఇబ్బందిగా మారిందని, అధికారులు కలుగజేసుకొని వేతనాలు ప్రతి నెలా అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాగా రూపాంతరం చెంది కలెక్టర్ కార్యాలయం ఏర్పడిన నాటి నుంచి సకాలంలో వేతనాలు చెల్లించక కాంట్రాక్టు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. తక్కువ వేతనంతో పనిచేస్తూ కలెక్టర్ కార్యాలయాన్ని సుందరంగా ఉంచుతున్న కార్మికులకు వేతనాలు ఇవ్వడంలో మాత్రం అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్మికులతో పని చేయించుకొని వారికి సకాలంలో వేతనాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఎలా జీవనం సాగిస్తాయని ప్రశ్నించారు. ఐదు గంటలు పనిచేయించుకుంటూ కేవలం రూ.240 చెల్లిస్తూ కార్మికులతో వెట్టి చేయిస్తున్నారన్నారు. కనీస వేతన చట్టాలకు సంబంధించి జీవోలు అధికారులకు తెలిసినా కాంట్రాక్టర్‌కు అనుకూలంగా నిర్ణయాలు మార్పు చేసుకొని కార్మికుల పొట్టుకొడుతున్నారన్నారు. ఇప్పటికైనా పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, లేదంటే రేపటి నుంచి నిరవధిక సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటేషన్ కార్మికులు రిజ్వాన్, నాగమణి, ఎల్లమ్మ, శ్రీదేవి, అలివేలు, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

చెంచులంటే ఎందుకంత ఈర్ష్య

- చెంచు ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్, మాజీ సర్పంచ్ చిగుర్ల మల్లికార్జున్

అచ్చంపేట, మే 21 : అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణకు చెంచుజాతి అంటే అంత ఈర్ష ఎందుకు..? చెంచులను బతికించమని అడిగితే మతిస్థితిమితం లేదంటావా? అంటూ చెంచు ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్, మాజీ సర్పంచ్ చిగుర్ల మల్లికార్జున్ బుధవారం ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తానంటే ఎమ్మెల్యేకు ఎందుకంత భయమని ప్రశ్నించారు. నీవు డాక్టర్‌వి.. 40వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలిచి ఎమ్మెల్యే అయ్యావు.. డాక్టర్‌గా ఒక రోగిని పట్టుకుంటే రూ.లక్ష వసూలు చేసే నైపుణ్యం ఉన్నది.. అలాంటిది మీకు మాపై ఈర్ష ఎందుకన్నారు. చెంచులకు మేలు చేస్తున్నావని అనుకుంటున్నావు.. కానీ మీకు తెలిసి చెంచులను చాలా మోసం చేస్తున్నావని, మా చారంలో ఏదో పండ్ల తోట పెట్టి కొందరికీ రోజు కు రూ.600 కూలి ఇచ్చి వచ్చిన పోడుభూమిలో కొన్ని కుటుంబాలకు పండ్లతోట పెట్టి ఏదో ఉద్ధరించామని బుర్రకథ చెప్పడం మీకు అలవాటేనన్నారు. అదే మీటింగ్ ఈర్లపెంట, అప్పాపూర్, మొడిమొల్కల పెంటల్లో పెట్టి ఉంటే బాగుండేదని, నీవు పెట్టిన సమావేశానికి ఎంత ఫలితం ఉందో ఎమ్మెల్యే తెలుసుకోవాలని సూచించారు. అరెస్టు చేసేది ఎందుకు..? భయపడేది ఎందుకని? మా చెంచు జాతి కోసం పోరాడటం అడవి మాకు నేర్పింది.. మీలా అపనిందలు వేసి తప్పించుకోవడం మాకు మా పెద్దలు నేర్పలేదన్నారు. ముందస్తుగా అరెస్టు చేసి మంచి పని చేశావు.. మా చెంచులపై ఇంకా పోరాటం చేసే స్ఫూర్తిని పెంచావు.. మతిస్థిమితం లేదన్న మీ మాటలను మీ విజ్ఞతకే వదిలేస్తున్నా అన్నారు. పాలకులు ఐదేండ్లకు ఒకసారి వస్తుంటారు.. పోతుంటారు.. కానీ నా జాతి పోరాటం ఆగదని, మీరు గ్రామాలు తిరగడానికి వచ్చేటప్పుడు నోటికొచ్చిన మాటలతో హామీలు ఇస్తారు.. తర్వాత పట్టించుకోరని ఆరోపించారు. మన్ననూర్ ఐటీడీఏ పరిధిలో చెంచు జనాభా పిల్లల నుంచి పెద్దల వరకు సుమారు 9,564 ఉన్నదన్నారు. ఇండ్లు పది వేలు అంటూ స్టేట్‌మెంట్ వేశారు.. తీరా చూసే సరికి 513 ఇండ్లు అంటున్నారు.. అందులో చెంచులకు ఇస్తారో? లేదో? కూడా తెలియదు.. చెంచుల చిన్న చిన్న సమస్యలైనా నెరవేర్చాలని కోరారు.

ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రశంసా పత్రాలు

- డీజీపీ జితేందర్ చేతుల మీదుగా అందజేత

మహబూబ్‌నగర్/జడ్చర్ల టౌన్, మే 21 : నేరాల నియంత్రణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహబూబ్‌నగర్ పోలీసు అధికారులకు డీజీపీ జితేందర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. బుధవారం హైదరాబాద్‌లోని డీజీ కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుల వివిధ రకాల పని తీరును పరిశీలించిన డీజీపీ వారిని ప్రశంసిస్తూ జిల్లాకు చెందిన సీఐ, ఎస్సైలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అందులో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నలుగురు పోలీసు అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. 60 రోజుల్లో పోక్సో కేసుల్లో ఎక్కువ చార్జిషీట్లు ఫైల్ చేసిన విషయంలో మహబూబ్‌నగర్ రూరల్ సీఐ బానోతు గాంధీనాయక్ రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం నిలిచారు. జిల్లా అధికారి ఉత్తర్వుల మేరకు ఔట్‌స్టాండింగ్ కేసుల డిటెక్షన్ చేసిన విషయంలో జడ్చర్ల సీఐ నాగార్జునగౌడ్ మూడో స్థానం, యూఐ కేసులు ఎక్కువ మొత్తంలో పరిష్కరించినందుకుగానూ మహబూబ్‌నగర్ రూరల్ ఎస్సై విజయ్ కుమార్ రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం, సీఈఐఆర్, క్యూర్ కోడ్ వినియోగంలో రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచిన నవాబ్‌పేట ఎస్సై విక్రమ్ ఐదో స్థానంలో నిలవడంతో వారిని డీజీపీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖకు ఇది గర్వకారణమైన ఘట్టం, జిల్లాకు చెందిన నలుగురు పోలీసు అధికారులు తమ కృషి, సమర్థతతో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందినందుకు ఎంతో ఆనందంగా ఉందని, వారు ప్రతి కేసును సమగ్రంగా పరిశీలిస్తూ, బాధితులకు న్యాయం అందించడంలో ముందుండి పనిచేయడం వల్లే ఈ గౌరవం లభించిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

డీజీపీ జితేందర్ చేతులు మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐలు గాంధీనాయక్, నాగార్జునగౌడ్

వర్షానికి తడిసిన ధాన్యం

తడిసిపోయిన మొక్కజొన్న ధాన్యం

తాడూరు, మే 21 : తాడూరు మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం కురిసిన వర్షానికి రోడ్లపై ఆరబోసిన మొక్కజొన్న, వరి ధాన్యం తడిసి ముద్దయ్యింది. రైతులు తమ వ్యవసాయ పొలాల నుంచి పంటనంతా తీసుకొచ్చి ఐతోల్ నుంచి మేడిపూర్ మధ్య నున్న ప్రధాన రహదారులపై ఆరబోశారు. బుధవారం ఉదయం కురిసిన అకాల వర్షానికి ఆరబోసిన ధాన్యం మొత్తం తడిసి ముద్దయ్యిందని, దీని వల్ల పంటకు గిట్టుబాటు ధర లభించదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గుతున్న ఉల్లి ధరలు

దేవరకద్ర, మే 21 : మార్కెట్‌లో ఉల్లి ధర రోజురోజుకు తగ్గుముఖం పడుతున్నది. బుధవారం దేవరకద్ర మార్కెట్‌కు వివిధ గ్రామాల నుంచి రైతులు 50 క్వింటాళ్ల ఉల్లిని విక్రయించడానికి తీసుకువచ్చారు. మార్కెట్ అధికారులు వ్యాపారులతో కలిసి టెండర్లు నిర్వహించగా క్వింటాకు గరిష్ఠంగా రూ.1400, కనిష్ఠంగా రూ.1210 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లి ఉత్పత్తి ఎక్కువ మొత్తంలో ఉండడంతో ధర తగ్గుముఖం పట్టినట్లు వారు పేర్కొన్నారు. అయితే రెండు వారాల నుంచి మార్కెట్‌లో ఉల్లి ధరలు బాగా తగ్గిపోతుండడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ నేత కారు ఢీకొని వ్యక్తి మృతి

- న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యుల డిమాండ్
- కుటుంబాన్ని ఆదుకోవాలంటూ బీఆర్ఎస్, బీఎస్‌పీ, సీపీఐ నాయకులు ధర్నా
- జిల్లా దవాఖాన ఎదుట గంటపాటు ఆందోళన, నిలిచిన వాహనాలు

నాగర్‌కర్నూల్/నాగర్‌కర్నూల్ రూరల్, మే 21: బీజేపీ నేత మాజీ పార్లమెంట్ సభ్యుడు పోతుగంటి రాములు తనయుడు పోతుగంటి భరత్‌ప్రసాద్ కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం తెలకపల్లి మండలం గట్టురావిపాకుల గ్రామానికి చెందిన చటమోని రాములు(40) అనే వ్యక్తి నాగర్‌కర్నూల్ నుంచి తన టీవీఎస్ వాహనంపై మంగళవారం సాయంత్రం స్వగ్రామానికి వెళుతున్నాడు. ఇదేక్రమంలో అచ్చంపేట వైపు నుంచి నాగర్‌కర్నూల్‌కు వస్తున్న భరత్‌ప్రసాద్ కారు రాములును ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడగా తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు నాగర్‌కర్నూల్ జనరల్ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాములు మధ్యరాత్రి మృతి చెందాడు. దీంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బుధవారం మధ్యాహ్నం నాగర్‌కర్నూల్ జనరల్ దవాఖానకు ఎదుట ధర్నాకు దిగారు. కుటుంబాన్ని ఆదుకొని న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు, బంధువులు, బీఆర్ఎస్, బీఎస్‌పీ, సీపీఐ నాయకులతోపాటు గట్టురావిపాకుల గ్రామస్తులు ఆందోళనకు దిగారు. దాదాపు గంటపాటు నిర్వహించిన ఆందోళనతో భారీ ఎత్తున వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు నచ్చజెప్పినా బాధితుడి బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళన విరమించలేదు. ఇటు బస్టాండ్ వరకు అటు ఆర్టీసీ డిపో వరకు భారీగా వాహనాలు నిలిచిపోవడంతో సీఐ కనకయ్య వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమింప చేయించారు.

మృతుడి కుటుంబీకుల ఆందోళన

చటమోని రాములు(ఫైల్)

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

ఎర్రవల్లి చౌరస్తా, మే 21: ఉద్యోగం రాలేదని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇటిక్యాలలో చోటు చేసుకున్నది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ అశోక్ కథనం మేరకు.. వనపర్తిలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన భరత్ కుమార్ (22) ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ జాబ్ చేస్తూ మానేశాడు. మరో జాబ్‌కోసం ట్రై చేయగా, రాకపోవడంతో మనస్తాపం చెంది మంగళవారం రాత్రి ఇటిక్యాల రైల్వే స్టేషన్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. తల్లి మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కర్ణాటకలో మల్లెందొడ్డి వాసుల దుర్మరణం

- కారును ఢీకొన్న ట్రావెల్ బస్సు, ఒకే కుటుంబానికి చెందిన నలుగురు, డ్రైవర్లు మృతి

మల్దకల్, మే 21 : కర్ణాటకలోని విజయపుర జిల్లా మనగుంబి సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్దకల్ మండలంలోని మల్లెందొడ్డికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురితోపాటు ఇద్దరు డ్రైవర్లు దుర్మరణం పాలయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మల్లెందొడ్డి గ్రామానికి చెందిన తెలుగు భాస్కర్ (43) 20 ఏండ్ల కిందట గ్రామాన్ని వదిలి గద్వాల పట్టణంలో నివాసం ఏర్పచుకున్నాడు. కాగా కర్ణాటక రాష్ట్రం బీజాపుర్ పట్టణంలోని కెనరా బ్యాంకులో ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల బీజాపుర్ నుంచి హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. బదిలీ సందర్భంగా 7 రోజుల పాటు సెలవులు ఉండడంతో భార్య పవిత్ర(35), కుమారులు అభిరామ్, ప్రవీణ్, కూతురు జ్యోత్స్నతో కలిసి కర్ణాటక రాష్ట్రంలోని పుణ్య క్షేత్రాలకు బయలు దేరారు. కాగా బుధవారం తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో విజయపుర జిల్లా మనగులి సమీపంలో వీరు ప్రయాణించే కారును కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భాస్కర్, ప్రవిత్ర, కూతురు జ్యోత్స్న, కుమారుడు అభిరామ్‌తోపాటు ట్రావెల్ బస్సు, కారు డ్రైవర్లు బసవన్న, శివన్న అక్కడికక్కడే మృతిచెందారు. మరో కుమారుడు ప్రవీణ్‌కు తీవ్ర గాయాలు కాగా వెంటనే బీజాపుర్ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన బీజాపూర్ తరలివెళ్లారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం రాత్రికి వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించే అవకాశం ఉందన్నారు.



భాస్కర్, పవిత్ర, జ్యోత్స్న, అభిరామ్ (ఫైల్)

చావులోనూ వీడని బంధం

- వదినా మరదళ్లకు ఒకేరోజు గుండెపోటు

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), మే 21 : కౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామానికి చెందిన చాకలి చంద్రమ్మ(70), మూసాపేట మండలం సంకలమద్దికి చెందిన నర్సమ్మ(58)లు వరుసకు వదినా మరదళ్లు. పైగా నర్సమ్మ కూతురిని చంద్రమ్మ కొడుకుతో వివాహం చేసి విియ్యపురాళ్లు అయ్యారు. వారిరువురికీ ఒకరంటే ఒకరికి అంతులేని ప్రేమాభిమానాలు. ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా, ఆపద వచ్చినా తల్లడిల్లేవారు. అలాంటి ప్రేమాభిమానాలు కలిగిన వదిన మరదళ్లు ఒకేరోజు తుదిశ్వాసలు వదిలారు. బంధువుల కథనం మేరకు, కౌకుంట్ల